# దిక్సూచి

## గ్రూప్- 1స్క్రీనింగ్ టెస్ట్



డాక్టర్ టి.సాయిలు

# భారత ఆర్థిక వ్యవస్థ

# గ్రామీణాభివృద్ధి

గ్రామాల్లో రక్షిత మంచినీరు, నివాస గృహాలు, రహదారులు, విద్యుత్, ప్రాథమిక విద్య, ప్రాథమిక వైద్యం మొదలైన అవస్థాపనా సౌకర్యాలు కల్పించడంతోపాటు అక్కడి ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడమే గ్రామీణాభివృద్ధి.

భారతదేశంలో గ్రామీణ జనాభా 1901లో 89.2 శాతం (21.3 కోట్లు) ఉండగా 1951లో 82.7 శాతం (29.9 కోట్లు)గా 2001లో 72.2 శాతంగా (74.3 కోట్లు)గా ఉంది. ఆర్థికాభివృద్ధి పరిణామ క్రమంలో పట్టణ జనాభా శాతం పెరగడం సాధారణం.

దేశంలో గ్రామీణాభివృద్ధి కోసం రెండు రకాల ప్రయత్నాలు జరిగాయి. ఒకటి గ్రామాల్లో కనీస అవసరాల కల్పన. రెండోది గ్రామీణ ప్రజలకు ఉపాధిని కల్పించడం ద్వారా వారి ఆదాయాన్ని పెంచి ప్రమాణాలను మెరుగుపర్చడం.

పై రెంటితోపాటు భూ సంస్కరణలు అమలు జరిగిన చోట కౌలు పరిమిత నిర్ణయం, కౌలుదారులకు రక్షణ, వారికి యాజమాన్య హక్కులు, మిగులు భూమిని పేద ప్రజలకు పంచడం మొదలైన చర్యలతో గ్రామీణ ప్రజల జీవన స్థితిని మార్చడానికి తీసుకున్నారు. వ్యవసాయరంగ అభివృద్ధి అలాగే గ్రామీణ ప్రజలకు సంస్థాపరంగా రుణ సౌకర్యం కల్పించడానికి తీసుకున్న చర్యలు కూడా గ్రామీణాభివృద్ధికి దోహదపడేవే.

అయితే పోటీ పరీక్షలకు తయారవుతున్న అభ్యర్థులు ప్రత్యేకించి గ్రామీణాభివృద్ధి కోసం భారతప్రభుత్వం అమలుపర్చిన పథకాలపై సాధారణ అవగాహన కలిగి ఉండాలి. ప్రస్తుతం అమలు జరుగుతున్న పథకాలపై పూర్తి అవగాహన కోసం ప్రయత్నించాలి. ముందుగా అమలు జరిగిన, జరుగుతున్న అన్ని పథకాలపై సాధారణ సమాచారాన్ని తెలుసుకుందాం.

1952లో గ్రామీణ ఆర్థిక, సామాజిక, సాంస్కృతికాభివృద్ధి కోసం కమ్యూనిటీ అభివృద్ధి కార్యక్రమాన్ని ఆరంభించారు. దానిని 1953లో 'జాతీయ విస్తరణ సర్వీసులు' పేరుతో అమలుపరిచారు.1971లో రహదారుల నిర్మాణం, పాఠశాల, వైద్యశాల భవనాల నిర్మాణం ద్వారా వేతన ఉపాధి కోసం ప్రజా పనుల కార్యక్రమాన్ని అమలుపరిచారు. 1972లో చిన్న రైతుల అభివృద్ధి ఏజెన్సీని చిన్న రైతులకు రుణ సహాయం అందించడం ద్వారా స్వయం ఉపాధితో జీవనోపాధి పొందడానికి ఆరంభించారు. 1972లోనే ఉపాంత రైతులు, రైతు కూలీలకు వేతన ఉపాధి కోసం ఉపాంత రైతులు, రైతు కూలీల అభివృద్ధి పథకాన్ని అమలుపరిచారు. 1973లో కరువు ప్రాంతాల్లో భూమి, నీరు ఇతర సహజ వనరుల పరిరక్షణ చేస్తూ ఆ ప్రాంతాలను అభివృద్ధి పరచడం కోసం కరువు ప్రాంతాల అభివృద్ధి పథకాన్ని ఆరంభించారు. 1977-78లో ఎడారి ప్రాంతాల అభివృద్ధి పథకాన్ని ఆరంభించి ఆ ప్రాంతాల్లో భూసార పెంపు, వర్షపు నీటి పరిరక్షణ మొదలైన కార్యక్రమాల ద్వారా ఉపాధిని కల్పించే ప్రయత్నం చేశారు.



1978లో సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకాన్ని స్వయం ఉపాధి కోసం ఆరంభించారు. 1979లో గ్రామీణ యువతకు శిక్షణ ఇవ్వడానికి ట్రైజంను ఆరంభించారు. 1980లో వేతన ఉపాధికి జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని ప్రారంభించారు. 1983లో భూమిలేని గ్రామీణ ప్రజలకు వేతన ఉపాధి కోసం ఆర్ఎల్ఇజిపిని ఆరంభించారు. 1982లో మహిళలకు బృందాల వారీగా స్వయంఉపాధిని కల్పించడం కోసం డ్వాక్రా పథకాన్ని ప్రారంభించారు. 1985లో గ్రామాల పేదలకు నివాస గృహాల నిర్మాణానికి ఇందిరా ఆవాస్ యోజనను ప్రారంభించారు. 1988-89లో సమగ్ర బంజరు భూముల అభివృద్ధి పథకాన్ని ఆరంభించారు. 1989లో ఎన్ఆర్ఇపి, ఆర్ఎల్ఇజిపి.ని కలిపి జవహర్ రోజ్‌గార్ యోజన (జెఆర్‌వై)ను గ్రామాల్లో వేతన ఉపాధికి ఏర్పాటు చేశారు.

1992లో గ్రామీణ చేతివృత్తుల వారికి ఆధునిక పరికరాలను అందించే కార్యక్రమాన్ని అమలుజరిపారు. 1993లో గ్రామీణ పేదలకు వేతన ఉపాధి కోసం 'ఉపాధి హామీ పథకం'ను ఆరంభించారు. అదే సంవత్సరంలో గ్రామీణ పేదలకు స్వయంఉపాధి కల్పించడానికి 'ప్రధాన మంత్రి రోజ్‌గార్ యోజన'ను అమలుపరిచారు. 1993లోనే తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులను చేపట్టే నిమిత్తం పార్లమెంటు సభ్యునికి ప్రతి సంవత్సరం కోటి (ప్రస్తుతం రూ.2 కోట్లు) అందించే పథకం ప్రారంభమైంది. 1999లో జవహర్ రోజ్‌గార్ యోజనను జవహర్ గ్రామ్ సంవృద్ధి యోజనగా పేరు మార్చారు. అప్పటివరకు గ్రామాల్లో అమలుజరుగుతున్న స్వయంఉపాధి పథకాలను కలిపి 1999లోనే స్వర్ణజయంతి గ్రామ్ స్వరోజ్‌గార్ యోజనను ఆరంభించారు. 2001లో అప్పటివరకు గ్రామాల్లో అమలుజరుగుతున్న వేతన ఉపాధి పథకాలైన జవహర్ గ్రామ్ సంవృద్ధి యోజన, ఉపాధి హామీ పథకాలను కలిపి సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజనను ఆరంభించారు.

గ్రామాల్లో ప్రాథమిక విద్య, ప్రాథమిక వైద్య, నివాస సౌకర్యం, రక్షిత మంచినీరు, పౌష్టికాహారం, విద్యుత్ మొదలైన అవస్థాపన సౌకర్యాలను కల్పించడానికి 2000-01లో ప్రధానమంత్రి గ్రామోదయ యోజనను ఆరంభించారు.

2005 సెప్టెంబర్‌లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని చేసి 2006 నుంచి అమలు చేస్తున్నారు. గ్రామాల్లో అవస్థాపన సౌకర్యాల అభివృద్ధికి 2006లోనే 'భారత్ నిర్మాణ్' ఆరంభించారు. 2008 సెప్టెంబర్‌లో ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజనను ప్రధానమంత్రి ఉపాధి సృష్టి కార్యక్రమంగా మార్చారు.

పై పథకాల్లో ప్రస్తుతం అమలులో ఉన్న పథకాలను గురించి కొంత వివరంగా చదవాలి.

### వేతన ఉపాధి

ప్రభుత్వం ఒక అభివృద్ధి కార్యక్రమం (ఉదాహరణకు రహదారుల నిర్మాణం) చేపట్టి ప్రత్యేక నైపుణ్యంతో అవసరం లేకుండా శ్రామికులకు ఉపాధి కల్పించి వేతనాన్ని అందిస్తారు. ఈ కార్యక్రమాలన్నింటిని వేతన ఉపాధి పథకం అంటారు. వేతనంలో కొంతభాగం కాని, పూర్తిగా కాని ఆహార ధాన్యాల రూపంలో ఇస్తే దానిని పనికి ఆహార పథకం అంటారు.

### స్వయం ఉపాధి పథకం

కొంత నైపుణ్యం గల నిరుద్యోగ యువతకు సబ్సిడీతో కూడిన రుణ సహాయం చేసి స్వయంఉపాధి పొందేలా చూస్తారు. దీనిని స్వయం ఉపాధి పథకం అంటారు.

## వివరాలు ఇవిగో

### స్టాటిస్టిక్స్‌లో...

❍ మేథ్స్ బాగా చేస్తాను. స్టాటిస్టిక్స్ తీసుకోమని సలహా ఇస్తున్నారు. ఏం చేయమంటారు?

**– రాజేశ్వరి, కాకినాడ**

✎ స్టాటిస్టిక్స్ అనేది మేథ్స్‌లో ఒక బ్రాంచ్. ఇది ఒక న్యూమరికల్ డాటా కలెక్షన్, అనాల్సిస్, ఇంటర్‌ప్రిటేషన్, ప్రజంటేషన్ డీల్ చేస్తుంది. స్టాటిస్టీయన్స్ మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, ఇందుకు సంబంధించిన ఇతర అప్లికేషన్లను అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ఈ డిగ్రీతో పనిచేసేవారిని చాలా సందర్భాలలో 'స్టాటిస్టీయన్' అనే పేరుతో పిలవకపోవచ్చు. బిజినెస్ అనలిస్ట్స్, ప్రొఫెసర్స్, మేథమెటీషియన్స్, స్టాటిస్టికల్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్ మొదలైన పేర్లతో కూడా వీరి ఉద్యోగాలు ఉంటాయి.

### ఫైర్ సర్వీస్‌లో చేరాలంటే...

❍ ఫైర్ సర్వీస్‌లో చేరాలనుకుంటున్నాను. సబ్ ఆఫీసర్ ఉద్యోగానికి కావాల్సిన విద్యార్హతలు, పరీక్ష విధానం తెలుపగలరు?

**– గిరి, మహబూబ్‌నగర్**

✎ ఈ విభాగం రాష్ట్ర జాబితాలో ఉండడంతో పరిపాలనను సంబంధిత రాష్ట్రాలు చూస్తాయి. బి.ఇ.ఫైర్ ఇంజనీరింగ్‌తో సహా రకరకాల కోర్సులను నాగపూర్‌లోని నేషనల్ ఫైర్ సర్వీస్ కాలేజ్ అందిస్తోంది. సబ్ ఆఫీసర్ కోర్సు కోసం జరిగే ఈ ఎంట్రెన్స్‌కు ముంబాయి, హైదరాబాద్, ఢిల్లీ, భువనేశ్వర్, నాగపూర్‌ల్లో పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. ఈ కోర్సు కాల వ్యవధి 25వారాలు.

అగ్ని ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఆస్తి, ప్రాణ నష్టం నివారించడం గురించి బోధిస్తారు. ఒకేరోజు రెండు దఫాలుగా



పరీక్ష నిర్వహిస్తారు. మొదటి పార్ట్‌లో ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్, రెండో పార్ట్‌లో సైన్స్, మేథ్స్‌లు ఉంటాయి. అభ్యర్థి సైన్స్ సబ్జెక్టులతో ఇంటర్ పూర్తి చేయాలి. వయస్సు 18-25 సంవత్సరాల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు గరిష్ఠ వయో పరిమితిలో మినహాయింపు ఉంటుంది. హిందీ, ఇంగ్లిష్ చదవడం, రాయడం, మాట్లాడగలగాలి. అభ్యర్థి ఎత్తు కనీసం 165 సెంటీ మీటర్లు ఉండాలి. బరువు 50 కిలోలు ఉండాలి. షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులను ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షకు పంపిస్తారు.

### చార్టర్డ్ అకౌంటెన్సీ

❍ బికాం తరవాత ఏమి చదవాలి? సిఏ చేస్తే మంచిదా? ఎంబిఏ చేస్తే మంచిదా?

**– కె. రామారావు, హైదరాబాద్**

✎ రెండూ మంచివే. ఎంబిఏ చేస్తే కార్పొరేట్ సెక్టర్‌లో అవకాశాలు విస్తృతంగా ఉంటాయి. ఇందులో బ్రాడ్ లెవల్‌లో చెప్పుకొంటే మార్కెటింగ్, హెచ్‌ఆర్, ఫైనాన్స్ స్పెషలైజేషన్లు ఉంటాయి. అయితే ఇటీవలి కాలంలో ఎంబిఏలో బ్యాంకింగ్, టెలికామ్, ఐటి ఇలా రకరకాలుగా మైక్రోలెవల్‌లో స్పెషలైజేషన్లు వస్తున్నాయి. డిగ్రీ తరవాత మీరు ఎంబిఏలో చేరవచ్చు. మన రాష్ట్రంలో ఈ కోర్సు చేయాలంటే ఐసెట్ రాయాలి. జాతీయ స్థాయిలో ఈ కోర్సు చేయాలంటే క్యాట్, మ్యాట్ రాస్తే మంచి సంస్థల్లో అడ్మిషన్ లభిస్తుంది. ఒక కంపెనీ బ్యాలెన్స్ షీట్లను సర్టిఫై చేసే అధికారం చార్టర్డ్ అకౌంటెన్సీ చేసినవారికే ఉంటుంది. బ్యాలెన్స్ షీట్‌పై సిఏ సర్టిఫికేషన్ లేకుంటే దానికి చట్టబద్ధంగా గుర్తింపు ఉండదు. ఆ కోర్సుకు ఉండే గుర్తింపు అలాంటిది. పన్నుల చట్టాలు, అకౌంట్స్ నిర్వహణ, కార్పొరేట్ లా మొదలైనవన్నింటిపై పట్టు లభిస్తుంది. కెరీర్‌లో ఉండే గ్రోత్ చాలా మంది యువతను ఈ కోర్సువైపు వచ్చేలా చేస్తోంది. ఇంత గ్రోత్ జరుగుతున్నందుకు కార్పొరేట్ సెక్టార్‌కు కృతజ్ఞతలు చెప్పుకోవాలి. సిఏ చేసినవారికి మంచి హోదాతో ఉద్యోగం ఉంటుంది. అకౌంట్స్, ఫైనాన్షియల్ మేటర్స్, మనీ మేనేజ్‌మెంట్, అకౌంట్స్ అనాల్సిస్, ఆడిటింగ్, ఫైనాన్షియల్ అడ్వైస్ మొదలైనవి చేయాల్సి ఉంటుంది. గతంలో సిఏ సిలబస్‌లో మేనేజ్‌మెంట్, బిజినెస్‌లకు సంబంధించిన అంశాల కొరత ఉండేది. కొత్త సిలబస్‌లో ఈ గ్యాప్ లేదు. ఆర్టికల్‌షిప్ పూర్తయిన తరవాత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా మెంబర్‌షిప్ కోసం దరఖాస్తు చేయడానికి ముందే తప్పనిసరిగా జనరల్ మేనేజ్‌మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్ శిక్షణ పొందాల్సి ఉంటుంది.

**– గోవర్ధనం కిరణ్‌కుమార్**

చిరునామా: **వివరాలు ఇవిగో,** కేరాఫ్ ఎడ్యుకేషన్ డెస్క్, ఆంధ్రజ్యోతి, ప్లాట్ నెం.76, రోడ్ నెం.70, అశ్విని ఎన్‌క్లేవ్, హుడాహైట్స్, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500 033



## నేర పరిశోధనలో కీలకం

# ఫోరెన్సిక్ సైన్స్



**– డాక్టర్ టి ఆర్.భగ్గి,** అకడమిక్ కో-ఆర్డినేటర్ ఫర్ ఫోరెన్సిక్‌సైన్స్, ఓయు, హైదరాబాద్

ప్రస్తుత సమాజంలో నేరాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. సైబర్ నేరాలు, ఉగ్రవాదుల కార్యకలాపాలు ఎక్కువ అవుతున్నాయి. చేసిన నేరాలకు నుంచి తప్పించుకునేందుకు నేరస్తులు అనేక కొత్త పద్ధతులను అవలంభిస్తున్నారు. ఉగ్రవాదులు సరికొత్త టెక్నాలజీని వినియోగిస్తుండటంతో వాటిని నిరోధించడం ప్రభుత్వాలకు పెద్ద సవాలుగా మారిం ది. సైబర్‌నేరాలను నిరోధించడానికి శాస్త్రీయ పరిశోధన (సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్) ప్రాధాన్యం బాగా పెరిగింది. ఆ దిశగా చేసిన ప్రయత్నాల్లో భాగంగా, విజ్ఞాన శాస్త్రంలో మనకు అందుబాటులోకి వచ్చినదే ఫోరెన్సిక్ సైన్స్. ఫోరెన్సిసిస్ అనే లాటిన్‌పదం దీనికి మూలం. నేరస్తులను గుర్తించడంలో కీలకపాత్ర పోషిస్తున్నందున దీని ప్రాముఖ్యం పెరిగింది. ఈ కోర్సు మనదేశంలో కేవలం మూడు యూనివర్సిటీలలో మాత్రమే అందుబాటులో ఉంది. అందులో ఒకటి హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ. ఈ కోర్సు ప్రాముఖ్యం, ఉపాధి అవకాశాలు, ఏయే రంగాల్లో ఇది ఉపయోగపడుతుందనే అనే అంశాలపై ఓయు ఫోరెన్సిక్ విభాగం అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ టి ఆర్ భగ్గి 'దిక్సూచి'కి వివరించారు.

✲ ఫోరెన్సిక్ సైన్స్ ప్రాముఖ్యం ఏమిటి?

✎ నేరస్తులను కనిపెట్టడంలో సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్‌కు ప్రాధాన్యం పెరుగుతోంది. అలాగే సైబర్ నేరాలు తోడైన నేపథ్యంలో ఫోరెన్సిక్ సైన్స్ ప్రాముఖ్యం మరింత పెరిగింది. అయితే, మన దగ్గర కంటే ఇతర దేశాల్లో మిగతా సబ్జెక్టులతో సమాన ప్రాధాన్యం ఫోరెన్సిక్ సైన్స్‌కు లభిస్తోంది.

✲ ఈ కోర్సుతో ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయి..?

✎ ఫోరెన్సిక్ సైన్ పరిజ్ఞానం ఇప్పుడున్న పరిస్థితుల్లో తప్పనిసరి. సైబర్ నేరాల పరిశోధనతో మొదలుకుని బ్యాకింగ్, ఫార్మాస్యూటికల్స్, పెయింటింగ్ పరిశ్రమలకు ఈ శాస్త్రంతో విస్తృత ప్రయోజనాలు ఉన్నాయి. అత్యాచారాలు, ఆత్మహత్యలు, ఫోర్జరీ, తాగి వాహనాలు నడపడం, నార్కోటిక్ మత్తు పదార్థాల వినియోగం, బాంబు దాడులు వంటి సంఘటనలను క్షుణ్ణంగా తెలుసుకునేందుకు దోహదపడుతుంది.

✲ ఈ కోర్సులో ఏమి బోధిస్తారు? ప్రాక్టికల్స్ ఎలా ఉంటాయి? తదుపరి ఏయే కోర్సులు చేయవచ్చు?

✎ ఈ కోర్సును కెమిస్ట్రీలో ఒక భాగంగా నిర్వహిస్తున్నాం. కెమిస్ట్రీ, బయోకెమిస్ట్రీ వంటి సబ్జెక్టులతోపాటు ఫోరెన్సిక్ సైన్స్‌కు సంబంధించిన అంశాలు బోధిస్తారు. పోలీసు అకాడమి, ఆసుపత్రులు, నేర పరిశోధక కేంద్రాలకు విద్యార్థులను నేరుగా తీసుకువెళ్లి ప్రాక్టికల్స్ నిర్వహిసాం. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి వెంటనే ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఆసక్తిని బట్టి ఈ సబ్జెక్టులో పరిశోధనలు కొనసాగించవచ్చు. అప్పుడు మరిన్ని అవకాశాలు లభిస్తాయి.

✲ ఎలాంటి ఉపాధి అవకాశాలు ఉన్నాయి..?

✎ ఈ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు దేశ విదేశాల్లో ఉపాధి అవకాశాలున్నాయి. కేవలం ల్యాబరేటరీల్లోనే కాకుండా నేరపరిశోధక విభాగాలు, సైబర్ సెక్యూరిటి, బయోటెక్నాలజీ, హైఎనర్జీ మెటీరియల్స్, బ్యాంకింగ్, ఫార్మాస్యూటికల్, పెయింటింగ్ పరిశ్రమలు, కెమికల్ లేబరేటరీలు, న్యాయసంబంధమైన సంస్థలు, అలాగే ఫింగర్‌ప్రింట్ నిపుణులుగా, క్రైమ్ ఇన్వెస్టిగేటర్లుగా, కెమికల్స్‌కు సంబంధించిన పరిశ్రమల్లో అనలిస్టులుగా ఉద్యోగాలు పొందవచ్చు. అధ్యాపక వృత్తిలో కూడా కొనసాగే అవకాశాలు ఉన్నాయి. మీడియాలో క్రైమ్ జర్నలిస్టుగా చేరవచ్చు.

✲ ఏయే వర్సిటీలలో ఈ కోర్సు అందుబాబులో ఉంది...? ఈ కోర్సులో ఎలా చేరాలి..?

✎ ఫోరెన్సిక్ సైన్స్ కోర్సును మన దేశంలో సాగర్, పంజాబీ యూనివర్సిటీలు మాత్రమే పీజీ స్థాయిలో ప్రవేశపెట్టాయి. ఈ రెండు యూనివర్సిటీలకు యుజిసి నుంచి నిధులు అందుతున్నాయి. ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించే ఈ కోర్సు పూర్తిగా సెల్ఫ్‌ఫైనాన్స్ పద్ధతిపైనే కొనసాగుతోంది. వర్సిటీ నిర్వహించే పీజీ కామన్ ప్రవేశ పరీక్ష ద్వారా ప్రవేశాలు జరుగుతాయి. ఏటా 22 మందిని చేర్చుకుంటున్నాం. అంతర్జాతీయ స్థాయికి దీటుగా మన కోర్సు ఉంటుంది. ఈ కోర్సులో చేరే విద్యార్థి ఒక చాలెంజింగ్‌గా చదవడమే కాకుండా బయటి ప్రపంచంలోఉన్న పోటీని తట్టుకునే విధంగా ఉండాలి.

✲ ఈ కోర్సుకు భవిష్యత్తు ఎలా ఉంది..?

✎ ఈ కోర్సుకు మంచి భవిష్యత్తు ఉన్నది. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో వస్తున్న మార్పులు, అలాగే ఎదురయ్యే వివిధ సమస్యల పరిష్కారం కోసం ఈ శాస్త్ర పరిజ్ఞానం చాలా అవసరం. మున్ముందు రోజుల్లో ఫోరెన్సిక్ సైన్స్ కీలకపాత్ర పోషించనుంది. ముఖ్యంగా క్లిష్టమైన క్రిమినల్ కేసుల పరిష్కారానికి ఫోరెన్సిక్ నిపుణుల సమర్థ సేవలను న్యాయవ్యవస్థ కోరుతోంది. వృత్తిపరంగా రాణించాలంటే కష్టపడే తత్వం ఉండాలి. ప్రతి విషయాన్ని లోతుగా పరిశోధించాలనే తత్వం, తార్కిక బుద్ధి, ఇంగితజ్ఞానం తదితరాలు కొద్దిగా ఎక్కువగా ఉన్న వ్యక్తులు ఈ రంగంలో రాణిస్తారు.

– రేగుంట వెంకటేష్

## రూరల్ డెవలప్‌మెంట్‌లో...

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎన్ఐఆర్‌డి) డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెల్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కి చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా దూరవిద్యా విధానంలో ఒక ఏడాది కాల వ్యవధి గల పీజీ డిప్లొమా ఇన్ సస్టయినబుల్ రూరల్ డెవలప్‌మెంట్ కోర్సుకు నోటిఫికేషన్ విడుదల చేశాయి. రెండు సెమిస్టర్లు 35 క్రెడిట్లుగా ఈ కోర్సు ఉంటుంది. ప్రతి సెమిస్టర్లో కౌన్సిలర్ల నేతృత్వంలో ప్రాజెక్టులు ఉంటాయి. సర్టిఫికెట్‌ను రెండు సంస్థలు కలిసి ఇస్తాయి. కోర్సు ఇంగ్లిష్ మీడియంలో ఉంటుంది. ప్రోగ్రామ్ ఫీజు రూ.17,000. ఎస్సీ, ఎస్టీ, వికలాంగ అభ్యర్థులు రూ.15,000 చెల్లిస్తే సరిపోతుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు హైదరాబాద్‌లో చెల్లే విధంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ పేర రూ.500 (ఎస్సీ, ఎస్టీ, వికలాంగ అభ్యర్థులైతే రూ.300)కి తీసుకున్న డిడి, పది రూపాయల స్టాంపులు అతికించిన సొంత చిరునామాగల కవరు, అభ్యర్థన ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెల్, ఎన్ఐఆర్‌డి, రాజేంద్రనగర్, హైదరాబాద్ – 30 చిరునమాకు పంపి నవంబర్ 20లోగా దరఖాస్తులు పొందవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తులను నవంబర్ 30లోగా పంపుకోవచ్చు. వెబ్‌సైట్: www.nird.org.in

## పేపర్ ప్రజెంటేషన్ పోటీలు

బీటెక్, ఎంబీఏ, ఎంటెక్, ఎంసీఏ, ఎమ్మెస్సీ చేస్తున్న విద్యార్థుల అవగాహనను పరిశీలించేందుకు 'హనీపాట్' ఐటి కన్సల్టింగ్ సంస్థ పేపర్ ప్రజెంటేషన్ పోటీలకు శ్రీకారం చుట్టింది. తాము చదువుకున్న సబ్జెక్టులో సరికొత్త అంశాలపై వారికి ఉన్న పరిజ్ఞానాన్ని ఇందులో పరీక్షిస్తారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ గవర్నెన్స్ సహకారంతో 'టెక్ స్టార్-2009' పేరిట ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఇది జాతీయస్థాయి పోటీ. విద్యార్థులు దేశంలో ఎక్కడినుంచైనా అన్‌లైన్‌లో (www.betechs.com) రిజిస్టర్ చేసుకోవచ్చు. తద్వారా పోటీలో పాల్గొనవచ్చు. నవంబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు వచ్చే ప్రజెంటేషన్లను పోటీకి పరిగణలోకి తీసుకుంటారు. వివిధ అంశాలపై అభ్యర్థులు సమర్పించిన టెక్నికల్ పేపర్లను ప్రొఫెసర్లు మూల్యాంకన చేస్తారు. దేశవ్యాప్తంగా వచ్చిన ప్రజెంటేషన్‌లలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేస్తారు. వాటిని సమర్పించిన వారికి, సంస్థ ప్రతినిధుల సమక్షంలో మరోసారి పోటీని నిర్వహిస్తారు. చివరిగా 2010 మార్చిలో ఆరు లక్షల రూపాయల విలువైన బహుమతులను విజేతలకు అందచేస్తారు.

## క్రాస్‌రోడ్స్



డాక్టర్ బి.వి.పట్టాభిరామ్
M.A., Ph.D
www.pattabhiram.com

### చదువుపై శ్రద్ధ లేదు?

❍ నేను ఇతరులను ఇమిటేషన్ చేస్తుంటాను. స్నేహం చేసినప్పుడు అనుకోకుండా వారి అలవాట్లు, ఇతర గుణాలను ఇమిటేషన్ చేస్తుంటాను. థియేటర్‌లో సినిమా చూసినప్పుడు హీరోగా, జనం నాకు చప్పట్లు కొడుతున్నట్లుగా ఊహించుకుంటాను. చదువు మీద శ్రద్ధ పెట్టలేకపోతున్నాను. ఈ సమస్యను వదిలించుకునేదెలా?

**– వెంకట్, తుని**

✎ ఇమిటేషన్ చేయగలడం మంచి అలవాటే. దానిని మీకు అనుకూలంగా మార్చుకోవచ్చు. సినిమా యాక్టర్లు, రాజకీయ నాయకులకు బదులుగా మీ తరగతిలో తెలివైన వారిని ఇమిటేట్ చేయండి. రాజారామ్ మోహన్‌రాయ్, బాలగంగాధర తిలక్, అబ్దుల్ కలామ్ లాంటి వాళ్ళను రోల్ మోడల్స్‌గా అనుకొని వారి స్థాయికి వెళ్ళాలని దానికి తగిన చర్యలు చేపట్టండి. కలలు కంటే అవి పగటి కలలుగా మిగిలిపోతాయి. కాబట్టి వాటిని సాకారం చేసుకొనే ప్రయత్నం చేయండి. విజయం మీదే!



### నా సమస్యకు పరిష్కారం..

❍ అందరి కంటే గొప్పగా చదవాలని ఆశ, కోరిక, పట్టుదల ఉన్నా నా చేతిరాత నాకు సహకరించడం లేదు. వేగంగా రాయడానికి అసలు సహకరించదు. దీంతో పరీక్షల్లో జవాబు తెలిసినా రాయడానికి సమయం సరిపోవడం లేదు. గతంలో రెండు సంవత్సరాలు చదువుకు గ్యాప్ వచ్చింది. దయచేసి నా సమస్యకు పరిష్కార మార్గం చూపండి?

**– శ్రీనివాస్, వరంగల్**

✎ చేతిరాత వేగంగా లేకపోవడానికి నాలుగు కారణాలుంటాయి. మొదటిది సరైన సాధన చేయకపోవడం, పట్టించుకోకుండా ఉండటం, రెండోది చేతికి, నరాలకు సంబంధించి సమస్య ఉన్నప్పుడు, మూడోది పెన్ను పట్టుకునే గ్రిప్ సరిగా లేకపోవడం లేదా పెన్ను పట్టు జారిపోవడం, చివరిగా రైటర్స్ క్రాంప్ అనే మానసిక సమస్య ఉండటం. సహజంగా అది రాత గురించి అతిగా ఆలోచించే వారికే ఉంటుంది. వారు ఒంటరిగా ఉంటే చకచకా రాసుకుపోతారు. ఎవరైనా చూస్తుంటే రాయలేరు. దీనికి ప్రాణాయామం లాంటి వ్యాయామం, పాజిటివ్ థింకింగ్, బిహేవియర్ థెరపీ చాలు.

### ఎలా చదివితే అర్థమవుతుంది?

❍ నేను ఇంటర్మీడియెట్ చదువుతున్నాను. ఏకాగ్రతతో చదివినా అర్థం కావడం లేదు. చదివేటప్పుడు గట్టిగా చదివితే అర్థమవుతుందా లేదా, పెదాలు నాలుక కదుపుతూ చదివితే అర్థమవుతుందా అలా కాకుండా మనసులోనే కళ్లతో చూసి చదివితే బాగా ఎక్కువ కాలం గుర్తుంటుందా?

**– ఎస్.కె. అహ్మద్, హైదరాబాద్**

✎ మీరు మూడు పద్ధతులు ఒక్కో రోజు చేసి చూడండి. మూడింటిలో ఏది ఫలితం ఇస్తే అది కంటిన్యూ చేయండి. ఎందుకంటే మూడూ మంచి పద్ధతులే. ఈ మూడు పనిచేయకపోతే చూపుడు వేలిని అక్షరాలపై కదుపుతూ చదవండి. బాగా పనిచేస్తుంది.

చిరునామా: **క్రాస్‌రోడ్స్,** కేరాఫ్ ఎడ్యుకేషన్ డెస్క్, ఆంధ్రజ్యోతి, ప్లాట్ నెం.76, రోడ్‌నెం.70, అశ్విని ఎన్‌క్లేవ్, హుడాహైట్స్, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500 033

## వ్యాపార సంస్థల జయాపజయాలపై

# ఐఎస్‌బి కేస్ స్టడీ

ఓడలు బళ్ళు, బళ్ళు ఓడలు అవుతాయన్నది వ్యాపార, పారిశ్రామిక రంగాలకు అక్షరాలా సరిపోయే సూక్తి. అందులోనూ ప్రస్తుత ప్రపంచీకరణ యుగంలో వైఫల్యాల వల్ల ఏర్పడే ఆటుపోట్ల ప్రభావం ఏ ఒక్క దేశానికో పరిమితం కాదన్న వాస్తవాన్ని గత ఏడాదిన్నరగా ప్రపంచాన్ని కుదిపివేస్తున్న ఆర్థిక తిరోగమనం అందరికీ రుచి చూపించింది. ఎన్ని ఆటుపోట్లయినా ఎదుర్కొని తరతరాలుగా వ్యాపార సామ్రాజ్యాలను విస్తరించి దేశాభివృద్ధికి తమ వంతు భాగం అందించిన వ్యక్తులు, కంపెనీల విజయగాథలూ ఉన్నాయి. గాలివాటంగా వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుని స్వల్పకాలంలోనే కోట్లకు పడగలెత్తి పరిస్థితుల వత్తిడి వల్ల పరాజయాన్ని అంగీకరించి బోర్డు తిప్పేసిన వ్యక్తులు, సంస్థల పరాజయ గాథలు కూడా ఉన్నాయి. ఇవన్నీ భవిష్యత్ తరాలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఇటు స్ఫూర్తిని, అటు హెచ్చరికలను అందించే కథలే. ఇలాంటి విజయగాథలను కేస్ స్టడీలుగా అభివృద్ధి చేసి భవిష్యత్ తరాలకు రిఫరెన్స్‌గా అందించే బృహత్తర కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని ఐఎస్‌బి చేపట్టింది. ఈ కృషిలో భాగంగా కేస్ స్టడీలుగా తీసుకున్న సంస్థలపై అధ్యయనం చేయడం, అధ్యయన పత్రాలు తయారుచేయడంలో తనకు తానే సాటి అయిన రిచర్డ్ ఐవీ బిజినెస్ స్కూల్ (కెనడా) భాగస్వామ్యంతో కేస్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఈ సెంటర్‌లో దేశంలోని వివిధ బిజినెస్ స్కూళ్ళ ఫ్యాకల్టీకి కేస్



స్టడీ, పేపర్ల రూపకల్పనలో సమగ్ర శిక్షణ అందించడం ఈ సెంటర్ లక్ష్యం. తొలి దశలో 25 బిజినెస్ స్కూళ్ళను భాగస్వాములుగా చేర్చుకుని, ఏడాది ముగిసే నాటికి 350 మంది ఫ్యాకల్టీకి ఈ సెంటర్ ద్వారా శిక్షణ ఇస్తారు. తదుపరి ఇతర బిజినెస్ స్కూళ్ళకు కూడా దీన్ని విస్తరిస్తారు. ఈ సెంటర్ అధ్యయనం కోసం తీసుకున్న సంస్థల్లో భారతి ఎయిర్‌టెల్ వంటి బడా సంస్థలే కాదు, ఆంధ్రాకే చెందిన స్వగృహ ఫుడ్స్, ఏడాది క్రితం యువతరాన్ని చక్కిలిగిలి పెట్టిన అష్టాచమ్మా సినిమా కూడా ఉన్నాయి.